రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

భానేష్ (ఫైల్)

తాండూర్, జనవరి 11 : మండలం లోని రేచిని రోడ్-రేపల్లెవాడ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై కిష్టంపేటకు చెందిన ఉప్పట్ల భానేశ్ (25) తాగుడికి బానిసై శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో సికింద్రాబాద్ నుంచి ఢిల్లీ వెళ్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు బెల్లంపల్లి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. మృతుడు సెంట్రింగ్ పని చేస్తూ వచ్చిన డబ్బులతో తాగుతూ తరచు ఇంట్లో గొడవ పడే వాడని ఇదే క్రమంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు బెల్లంపల్లి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక

కోటపల్లి, జనవరి 11 : కోటపల్లి మండలం మల్లంపేటకు చెందిన ప్రముఖ చిందు యక్ష గాన కళాకారుడు గడ్డం రామచంద్రు కళా రత్న, స్వర్ణ కంకణ జాతీయ సంక్రాంతి పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈ నెల 19న కరీంనగర్‌లో జరగనున్న కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

శుధోధన్(ఫైల్)

దండేపల్లి, జనవరి11: దండేపల్లి మండలం లోని కన్నేపల్లిలో గల శ్రీవెంకటేశ్వర కాటన్ మిల్లులో పనిచేస్తున్న గాయకాంబ్లే శుధోధన్(38)ట్రాక్టర్ ఢీకొని మృతి చెందాడు. దండేపల్లి ఎస్ఐ ఉదయ్‌కిరణ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నర్సాపూర్‌కు చెందిన గాయకాంబ్లే శుధోధన్(38) మూడేళ్లుగా కన్నేపల్లి లోని మిల్లులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత నెలలో ఇదే మిల్లులో అదే గ్రామానికి చెందిన బాలేరావ్, సోన్‌కాంబ్లే కిరణ్, అశ్వజిత్‌తో కలిసి పనిచేస్తున్నాడు..ట్రాక్టర్ డ్రైవర్ సోన్‌కాంబ్లే కిరణ్ మిల్లుకు సంబంధించిన ట్రాక్టర్తో అతి వేగంగా అజాగ్రత్తగా నడిపి శుధోధన్‌ను ఢీకొట్టడంతో ఛాతిలో బలమైన గాయాలయ్యాయి. గమనించిన చుట్టు ప్రక్కల వారు సమీపంలోని లక్సెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భర్త శుధోధన్ మరణానికి కారణమైన సోన్‌కాంబ్లేపై చట్టరీత్యా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని భార్య ఉషాత్తే ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక

రామచంద్రు

కోటపల్లి, జనవరి 11 : కోటపల్లి మండలం మల్లంపేటకు చెందిన ప్రముఖ చిందు యక్ష గాన కళాకారుడు గడ్డం రామచంద్రు కళారత్న, స్వర్ణ కంకణ జాతీయ సంక్రాంతి పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈ నెల 19న కరీంనగర్‌లో జరగనున్న కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

వాసవీ క్లబ్ 107 జిల్లా సంయుక్త కార్యదర్శిగా సిర్ప శ్రీకాంత్

సిర్ప శ్రీకాంత్

తాండూర్, జనవరి 11 : తాండూర్ వాసవీ క్లబ్ సభ్యుడు సిర్ప శ్రీకాంత్‌కు వీ 107 ఏ జిల్లా క్లబ్‌లో సంయుక్త కార్యదర్శిగా చోటు కల్పించినట్లు జిల్లా గవర్నర్ వాసవియన్ ఇల్లందుల కిశోర్ తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ ఇల్లందుల కిశోర్, జిల్లా కార్పొరేట్ వైస్ చైర్మన్ గోల్డెన్ స్టార్ కేశెట్టి సంతోష్ కుమార్, జిల్లా కోశాధికారి బోనగిరి వేణుగోపాల్‌కు సిర్ప శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. తన వంతుగా వాసవీ క్లబ్‌కు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

కోడి పందేల నిర్వాహకుల బైండోవర్

కన్నెపల్లి, జనవరి 11 : కన్నెపల్లి మండలం లోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన కొంత మంది గతంలో కోడి పందేలు నిర్వహించి పట్టుబడగా వారిని శనివారం కన్నెపల్లి ఎస్ఐ గంగారాం బైండోవర్ చేశారు. చంద్రగిరి రాజేశ్, కారం సంతోష్ అనే ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి

బెల్లంపల్లి, జనవరి 11 :ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, స్కాలర్‌షిప్ ఇన్‌చార్జి మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. పదవ తరగతి మెమోలో ఏ విధంగా పేరు ఉందో అదే విధంగా ఆధార్‌కార్డులో మార్చుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్, వేలిముద్రను కూడా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈనెల 16వ తేదీలోగా స్కాలర్‌షిప్ దరఖాస్తు, రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో నోడల్ అధికారి కిష్టయ్యను 9701867606కు సంప్రదించాలని సూచించారు.

పశువుల్లో గర్భ కోశ వ్యాధి నివారణ చికిత్స

రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శాంతిరేఖ

హాజీపూర్, జనవరి 11 : మండలంలోని పడ్తన్‌పల్లిలో జిల్లా పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి శాంతి రేఖ మాట్లాడుతూ నూతన టెక్నాలజీలో భాగంగా పశువుల్లో లింగ నిర్ధారిత వీర్యం చేయడం 90 శాతం ఆడ దూడలు పుడుతాయని, ఈ ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కృతిమ గర్భధారణ ద్వారా పుట్టిన 14 దూడలకు నట్టల నివారణ మందులను వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గోపాల మిత్ర సూపర్ వైజర్ ఎ రవి, స్థానిక గోపాల మిత్ర ఐ రవితో పాటు పాడి పశువుల రైతులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

చెన్నూర్ రూరల్, జనవరి 11: చెన్నూర్ మండలంలో సంక్రాంతి పండగను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని చెన్నూర్ సీఐ రవీందర్ శనివారం తెలిపారు. సంక్రాంతి సెలవుల సందరర్భంగా హాస్టళ్ల నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థులు ఇంటి వద్ద ఉండాలని తెలిపారు. సమీప చెరువు, గోదావరి పరిసర ప్రాంతాలు, అన్నారం బ్యారేజ్ వైపు వెళ్లకుండా ఉండాలని అన్నారు. పండు సందర్భంగా కోడి పందేలు, పేకాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ సందర్భంగా ఎస్ఐలు సుబ్బారావు, వెంకటేశ్వర్లు గ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తారని, గ్రామాల్లో ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు లేదా 100కు కాల్ చేయాలని సీఐ రవీందర్ సూచించారు.

నేడు మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం

శ్రీరాంపూర్, జనవరి 11 : ఈ నెల 12న ఆదివారం నస్పూర్ కాలనీ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10.30 గంటలకు మున్నూరు కాపు సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా, నస్పూర్ కోల్‌బెల్ట్ స్థాయి సర్వసభ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు మున్నూరు కాపు సంఘం జిల్లా అధికార ప్రతినిధి భాస్కరి రాజేశం, యూత్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి సురేశ్ పేర్కొన్నారు. మున్నూరు కాపు సంఘం 2025 క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని వివరించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ దండె విఠల్, మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం, జిల్లా అధ్యక్షుడు నల్ల శంకర్, నస్పూర్ మాజీ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి మంచిర్యాల జిల్లా కోల్‌బెల్ట్ మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సీసీసీ, శ్రీరాంపూర్ ఏరియా సభ్యులు, మున్నూరు కాపులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్మికులకు సరుకుల అందజేత

మంచిర్యాలటౌన్, జనవరి 11: మంచిర్యాల మున్సిపాలిటీలో పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు 2025 సంవత్సరానికి సంబంధించిన సరుకులను మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య చేతుల మీదుగా అందజేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కార్మికులకు సబ్బులు, నూనె ప్యాకెట్లు, యూనిఫాంలు, పాదరక్షలను అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సుదమల్ల హరికృష్ణ, రామగిరి భానేశ్, బీ ప్రకాశ్, కార్మిక సంఘం నాయకులు దేవి సత్యం, సుదమల్ల అశోక్‌తేజ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కిరణ్, వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు .

క్రికెట్ పోటీలు ప్రారంభం

జైపూర్, జనవరి11: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జైపూర్‌లోని నిర్వహిస్తున్న వీవీ క్రికెట్ టోర్నీని జైపూర్ ఎస్ఐ శ్రీధర్, కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతియేటా క్రికెట్ టోర్నీలను నిర్వహించేందుకు నిర్వాహకులు ముందుకు రావాలని ఎస్ఐ పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. క్రికెట్ టోర్నీ నిర్వాహకులకు ముదిగుంట గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాస్ యాదవ్ రూ.5 వేల విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఫయాజ్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం

వేమనపల్లి, జనవరి 11 : మండలంలోని నీల్వాయి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అభిషేక్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఇటీవల మండలంలోని ఆశ్రమ పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన 60 మందికి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించి ప్రత్యేక వాహనాల్లో పంపించినట్లు తెలిపారు. మండలానికి వచ్చి ఆపరేషన్లు చేయించుకున్న వారికి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్లు చేయించుకున్న వారు పోలీసులు, డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్, పోలీసులున్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కోలి వేణుమాధవ్‌రావు

వేమనపల్లి, జనవరి 11 : మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోలి వేణుమాధవ్‌రావు ఆధ్వర్యంలో శనివారం వేమనపల్లిలో వాలీబాల్ టోర్నీప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కుబిడె మధుకర్, సింగిల్ విండో చైర్మన్ కుబిడె వెంకటేశం, సీనియర్ నాయకులు పురాణం లక్ష్మీకాంత్, సాయి, రాజలింగు, మొండి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కిష్టంపేటలో..

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐలు సుబ్బారావు, వెంకటేశ్వర్లు

చెన్నూర్ రూరల్, జనవరి 11: చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామంలో బాల గణేశ్ మండలి ఆధ్వర్యంలో నియోజక వర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. క్రికెట్ టోర్నమెంట్‌ను చెన్నూర్ ఎస్ఐలు సుబ్బారావు, వెంకటేశ్వర్లు ప్రారంభించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, యువత రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జాడి శ్రావణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో అధిక దిగుబడి

ఉట్నూర్, జనవరి 11: బిందు సేద్యంతో అధిక దిగుబడి సాధించవచ్చని ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యానవన శాఖ అధికారి గుడిమళ్ళ సందీప్ కుమార్ అన్నారు. శనివారం ఉద్యానవనాన్ని ఆదిలాబాద్ హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జామ తోటలో సాగు, కత్తిరింపులు చేసే విధానం, ఎరువులు, చీడ పీడల నివారణ, మొక్కలు ఉత్పత్తి వంటి విషయాలు, మామిడి మొక్కలు అంటుకట్టె విధానం, మునగ, కరివేపాకు, క్రోటన్స్ అలంకరణ, బిందు, తుంపర సేద్యం, పండ్ల తోటల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీ, అధ్యాపకులు అశ్విని, చాణక్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే శిక్షలు తప్పవు

- సీఐ వేణుచందర్

రోడ్డు భద్రతా వారోత్సవాల సదస్సులో మాట్లాడుతున్న సీఐ వేణుచందర్

శ్రీరాంపూర్, జనవరి 11 : వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలు నివారణకు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే శిక్షలు తప్పవని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ హెచ్చరించారు. శనివారం శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వేణుచందర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. పోలీసులు రోడ్డు సేఫ్టీపై, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి వాహనదారుడూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కోరారు. తొందరపాటుతో నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని కోరారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, శ్రీరాంపూర్ ఎస్ఐ లక్ష్మీప్రసన్న, ఆటో డ్రైవర్లు, టాటా ఏసీఈ, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

వివేకానంద జయంతి వేడుకలు

సేవాజ్యోతిలో వివేకానంద జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

తాండూర్, జనవరి 11 : మండల కేంద్రంలోని సేవాజ్యోతి శరణాలయంలో వ్యవస్థాపక అధ్యక్షురాలు గజ్జెల్లి శ్రీదేవి మల్లేశం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత మేల్కొని ఉంటే దేశం మేల్కొన్నట్లు అని పేర్కొన్నారు. భారతదేశం గొప్పతనం, స్వామి వివేకానంద సూక్తులు స్ఫూర్తిగా తీసుకుని ఆ మహనీయుని బాటలో నడవాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాజ్యోతి నిర్వాహకులు స్వప్న, కృష్ణ, మతిస్థిమితం లేని మహిళలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో వివేకానంద జయంతి

నస్పూర్, జనవరి 11 : నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో ఆదివారం ఉదయం 10:30 గంటలకు స్వామి వివేకానంద జయంత్యుత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజ్‌వీరు తెలిపారు. క్రీడాకారులు, అధికారులు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం బాక్సింగ్ కోచ్ రాజేశ్ 9963539234లో సంప్రదించాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- లేదంటే రేపటి నుంచి ఆందోళన చేస్తాం
- ప్రభుత్వ దవాఖాన కాంట్రాక్టు కార్మికులు

మాట్లాడుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

బెల్లంపల్లి, జనవరి 11: వంద పడకల దవాఖాన కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించకుంటే ఈ నెల 13 నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అబ్బోజి రమణ తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులు శనివారం దవాఖాన ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ పొందినప్పటి నుంచి ఏ నెల కూడా జీతం ఇవ్వలేదని పేర్కొన్నారు. పీఎఫ్ పేరుతో కోత విధించిన డబ్బులు కూడా కార్మికుల ఖాతాలో జమ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా వేతనాలు చెల్లించకపోవడంతోనే నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

బెల్లంపల్లి, జనవరి 11 : గతేడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి లక్ష్మణ్ విమర్శించారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మహిళా సమాఖ్య భవనాలకు కేటాయించిన నిధులను సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి మళ్లించుకుంటున్నారని ఆరోపించారు. మండలంలోని గ్రామాలకు ఒక్కో నిర్మాణానికి రూ. 18 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను తప్పుదోవ పట్టించి నిధులను మళ్లించారని తెలిపారు. గత ప్రభుత్వం మహిళా సమాఖ్య భవనాలు, నూతన గ్రామపంచాయతీ కార్యాలయాల కోసం మంజూరు చేసిన నిధులను వాటికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు వేముల కృష్ణమూర్తి, మల్లేశ్, బాకం సుమన్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్, రాజమౌళి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతి

డార్ఫ్ బెట్టి ఎలిజబెత్ దంపతుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

బెజ్జూర్, జనవరి 11 : మండల కేంద్రం లోని ఆదివాసీ భవనంలో మండల ఆదివాసీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఆదివాసుల ఆత్మబంధువు అయిన ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజబెత్ దంపతుల 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం నాయకులు తలండి రాములు మాట్లాడుతూ లండన్ విశ్వవిద్యాలయంలో మానవ శాస్త్రంలో డాక్టరేట్ పొంది పలు దేశాల్లో పర్యటించి ఆదివాసీ గిరిజనుల జీవన విధానం, స్థితిగతులపై అధ్యయనం చేశారని తెలిపారు. తద్వారా ఆదివాసీ గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మండల అధ్యక్షుడు సిడం సకారం, గౌరవ అధ్యక్షుడు బక్కయ్య, ఆదివాసీ టీచర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు చింతపుడి రాజారాం, నాయకులు మానేపల్లి మల్లేశ్, సిడం రమేశ్, పేదం నరేశ్, పోల్క వెంకటేశ్, గావిదె నీలయ్య, తదితరులున్నారు.

సంక్రాంతి సంబురాలు

ముగ్గులు వేస్తున్న విద్యార్థుల తల్లులు

ముగ్గులను పరిశీలిస్తున్న ముఖ్యఅతిథులు అబ్దుల్ అజీజ్, ఊట్కూరి నరేందర్‌రెడ్డి

రామకృష్ణాపూర్, జనవరి 5: రామకృష్ణాపూర్‌లోని తవక్కల్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబురాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల పేరెంట్స్‌కు, జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల మహిళా ఉపాధ్యాయులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తవక్కల్ విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్‌అజీజ్, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్కూరి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్ర పాని, ట్రస్మా మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ శ్యామ్‌సుందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్, ట్రస్మా నాయకులు జుల్ఫీకర్, మమత, రామకృష్ణ, క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు గాండ్ల సమ్మయ్య, వార్డు కౌన్సిలర్ ప్రేమలత రాజేశ్, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మంచిర్యాల అర్బన్, జనవరి 11: కీటక జనిత వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, వాటికి దూరంగా ఉండాలని మంచిర్యాల కిటక జనిత వ్యాధుల ప్రోగ్రాం అధికారిణి అనిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంసీసీలో గల అంబేద్కర్ కాలనీలో కిటక జనిత వ్యాధుల విభాగం, పాత మంచిర్యాల పట్టణ ఆరోగ్య కేంద్రం సమన్వయంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా.అనిత మాట్లాడుతూ దోమకాటుతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు, మెదడు వాపు వ్యాధులు వచ్చే అవకాశముందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వో అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సాకడలో కబడ్డీ పోటీలు

కెరమెరి, జనవరి 11: మండలం లోని చిన్న సాకడ గ్రామంలో ఆదివారం నుంచి పెందోర్ జంగు స్మారక కబడ్డీ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఓం జై శ్రీ బాబా యూత్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు ప్రథమ బహుమతి రూ.7,777, ద్వితీయ బహుమతి రూ.4,444, తృతీయ బహుమతి రూ.2,222 నగదు అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.301 ప్రవేశ రుసుము చెల్లించి ఆటల పోటీల్లో పాల్గొన్నాలని వారు కోరారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

మేరగూడలో వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న అటవీ అధికారులు

పెంచికల్ పేట్, జనవరి 11 అడవుల సంరక్షణ మన అందరి బాధ్యత అని డిప్యూటీ రేంజ్ అధికారి జమీల్ అహ్మద్ అన్నారు. శనివారం మారుమూల గిరిజన అటవీ ప్రాంత గ్రామాలైన మేరగూడ, కమ్మర్ గాం గ్రామాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో జరిగే అగ్ని ప్రమాదాల కారణాలు,నివారణ చర్యలు,పులి సంచారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అడవులు సమృద్ధిగా పెరిగితేనే సమతుల్య వర్షపాతం నమోదై రైతులకు పంటలు పండుతాయని తెలిపారు. వన్యప్రాణులను వేటాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లూర్ బీట్ అధికారి సతీశ్, కమ్మర్ గాం సెక్షన్ అధికారి జగన్మోహన్ గౌడ్, బీట్ అధికారి విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ మధునయ్య గ్రామస్తులు బాపు, బాపురావు, యానిమల్ ట్రాకర్స్ రాజు, రామయ్య, నందు తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయించడం నేరం

దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ కొమురయ్య

పెంచికల్ పేట్, జనవరి 11 ప్రభుత్వ నిషేధిత చైనా మాంజ విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కొమురయ్య అన్నారు. శనివారం మండల పరిధిలో దుకాణాలను తనిఖీ చేసి వ్యాపారులకు సూచనలు చేశారు. చైనా మాంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచిఉందని తెలిపారు. చైనా మాంజాతో నైలాన్, సింథటిక్ దారాలు పక్షులు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని తెలిపారు. చైనా మాంజా విక్రయించినా, రవాణా చేసిన సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

జిల్లా ఆర్గనైజర్‌గా గోగర్ల రాజేశ్

గోగర్ల రాజేశ్

రెబ్బెన, జనవరి 11: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సమాచార హక్కు చట్టం 2025 సొసైటీ జిల్లా ఆర్గనైజర్‌గా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన గోగర్ల రాజేశ్‌ను నియమించినట్లు సొసైటీ రాష్ట్ర నియామకాలు ఇన్‌చార్జి చందమల్ల సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండగుర్ల కమలాకర్ తెలిపారు. సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలయ్యే విధంగా తన వంతుగా కృషి చేస్తానని, తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన సుధాకర్, కమలాకర్, జిల్లా సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గోగర్ల రాజేశ్ పేర్కొన్నారు.

కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్‌ఎం జంగు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 11: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ జట్టుకి ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 11 నుంచి 17 వరకు జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో కోచ్ అరవింద్ ఆధ్వర్యంలో నిర్వహించే కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు శ్యాం సుందర్, రమేశ్ తెలిపారు. శనివారం ఈ కోచింగ్ క్యాంప్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోచ్ అరవింద్, రాకేశ్ తదితరులున్నారు.

'ప్యాకేజీ కోసమే సభలు'

కాగజ్‌నగర్, జనవరి 11: లక్ష డబ్బులు వెయ్యి గొంతుకలు...బీజేపీ ప్యాకేజీ కోసమేనా అని తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి రాష్ట్ర వైస్ చైర్మన్ ఇరిగిల భాస్కర్ ప్రశ్నించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్‌లో మాదిగ సంఘాల మహా కూటమి రాష్ట్ర అధ్యక్షుడు పోకల కిరణ్ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వైస్ చైర్మన్ ఇరిగిరాల భాస్కర్ మాట్లాడారు. సాక్షాత్తు పార్లమెంటు నిండు సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలపై మందకృష్ణ మాదిగ ఎందుకు స్పందించడం లేదని, అంబేద్కర్ వాదిగా చెప్పుకునే మందకృష్ణ మాదిగ దీనిపై విమర్శించకపోవడం వివిధ అనుమానాలకు కారణాలకు తావిస్తోందని, ఫిబ్రవరి నెల 7న లక్ష డబ్బులు..వెయ్యి గొంతులు సభలో తీర్మానాలు చేయకుండా ఏ విధంగా సభ పెట్టి మీరు మాదిగ సబ్బండ వర్గాలకు ఏ విధమైన హామీ ఇవ్వగలరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కోకిల శ్రీమన్ నరేశ్, అశోక్ సంజు కుమార్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు

మైనింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జనవరి 11 : శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7గనిపై కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ స్టాఫ్ రెస్ట్‌హాల్స్ శుభ్రం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు, నాయకులు జీవన్‌రావు, రాకేశ్‌రెడ్డి, బొడ్డు ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్యాస్ బుడ్డి దొంగలు అరెస్టు

ఎదులాపురం, జనవరి 11 : ఆటోలో ఉన్న గ్యాస్ బుడ్డి దొంగతం చేసిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన తాజ్‌మియా శుక్రవారం తన ఆటోలో గ్యాస్ బుడ్డి, ఫ్లెక్సీకి సంబంధించిన రోల్‌ను అంబేద్కర్ చౌక్‌లోని నవదుర్గ ఫ్లెక్సీ షాపులో యజమానికి రోల్‌ను ఇచ్చి 15 నిమిషాల తర్వాత బయటకు వచ్చాడు. ఆటోలో ఉన్న గ్యాస్ బుడ్డి కనిపించలేదు. దీనితో వన్‌టౌన్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం ఠాకూర్ హోటల్ సమీపంలో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పంజాషాకు చెందిన షేక్ ఉస్మాన్, కొలిపురాకు చెందిన సయ్యద్ ఇర్ఫాన్, మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన కాంబ్లే శివను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి దొంగలించబడిన గ్యాస్ బుడ్డిని స్వాధీనం చేసుకున్నామన్నారు.